


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

# -159-

**(11 జూలై 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**పూర్వకాలంలో మహర్షులు**, పతివ్రతలూ, సిద్ధులూ, సంభూతాల్ని గజగజలాడించేవారిని, గిలక్కాయలాగా గిరగిర తిప్పివేశారని ఇలా ఎన్నెన్నో ఘట్టాలు వర్ణించబడినాయి.

చిన్న స్విచ్ ఆన్‌చేసి దీపం ఆర్పివేసినట్లుగా, సూర్యుణ్ణి కావాలంటే ఏ మిట్టమధ్యాహ్న సమయంలోనో ఆపుచేయగల శక్తి కొందరికి వుండేదట. ఇలాంటి సంఘటనలు నిజమా? కేవలం వూహలా? కట్టుకథలా? గమ్మత్తు కోసం చెప్పారా? లేకపోతే లోకాన్ని గారడీచేశారా? అనిపిస్తుంది.

విష్ణుమూర్తి అంతటివాడు, సైంధవుణ్ణి చంపడంకోసం అర్జునికి సహాయం చేయతలచినప్పుడు – సూర్యుడికి చక్రం అడ్డం వేసి, ఆ ఘన కార్యం చేయదలచారు గాని, సూర్యుణ్ణి స్విచ్ ఆఫ్‌చేసి అదృశ్యుణ్ణి చెయ్యలేదు.

కాకపోతే ఎవరి శక్తి వారిది. ఎవరి యుక్తివారిది అని చెప్పుకోవచ్చుకదా. పోతే సూర్య చంద్ర, నక్షత్ర గ్రహాలమీద మానవశక్తి ప్రసరించి, వాటిని అరికట్టగలవా? అనే ప్రశ్నలనుమానించకుండా నమ్మడమొకటే దీనికి మార్గం అనిపించేది.

కానీ ఒక మిత్రుడు మాత్రం ఇలాటి ప్రయోగాలు సాఫల్యమేనంటున్నారు. వెనుకటి మాట దేనికి? నేను స్వయంగా అలాటి ప్రయోగాలు చేశానంటున్నారు. ఒకసారి చంద్రుణ్ణి కొంచెం ఓరగా వంచకలిగామంటున్నారు.

అందువల్ల పదో నెంబరు అపోలో విషయంలో కాబోలు, చంద్రమండలం మీద అనుకున్న ఫలితాలు రాలేదంటున్నారు. అమెరికనులు కోరిన పరిశోధనలు సరిగ్గా జరగలేదన్నారు. ఎందువల్ల చంద్రమండలాన్ని కొంచెం వోరగా మా మిత్రుడు వంచకలగడం వల్లనట.

అప్పటికీ ఆయనగారు ముందుగానే అమెరికనులకు హెచ్చరిక పంపారట. “మీరిప్పుడు అపోలోను పంపకండి. చంద్రుడు సరి అయిన పొజిషన్‌లో లేడు. ఒరిగి వున్నాడు. మీ లెక్కల ప్రకారం ప్రయాణం కుదరదు” – అని.

వారు వినకుండా అపోలోనూ పంపారట. అందువల్లనే అది వెళ్ళి అక్కడ వున్న గోతిలో పడిపోయింది. మరి వాళ్ళు ఎంతో జాగ్రత్తగా దిగే స్థలాన్ని నిర్ణయించుకుంటారుకదా, అలా వెళ్ళి ఎందుకు నెరియలో ఇరుక్కుపోయింది, చంద్ర మండలం వోరగా తిరగడం వల్లనేనంటారు మా పండిత మిత్రులు.

వారి మాటలు వింటుంటే ఎంతో ఆశ్చర్యం వేస్తుంది. ఎప్పటి వారి మాటో ఏమిటి, ఇలా పురాణంలో విషయాలు చదివి అవునా కాదా, అని ఆలోచిస్తూ కూర్చోవడమేమిటి? సాక్షాత్తూ ఆంధ్రదేశంలో జన్మించిన ఒక పండిత మిత్రుడు ఇలాటి అద్భుత కార్యాలు జరిపి చూపిస్తుంటే, దీన్నిబట్టి వెనుకటి వారి మహిమలు నమ్మక ఏం చేస్తారు.

అందాకా ఎందుకు, ఆ మిత్రుడు. మొన్న వేసవికి ముందు అదేదో గ్రహం మీద తమ ప్రభావాన్ని పంపారుట. అక్కడితో ఎంతో మార్పు వచ్చిందిట. గత మే నెల ఇరవయ్యో తేదీనుంచి దేశం చల్లబడిపోవడానికి కారణం అదేనంటాడు ఆ ప్రతిభావంతుడైన మిత్రుడు.

ఋతువులను బట్టి  బాతు మెడలాగా తిప్పిపారవేసే శక్తి కూడా మానవులకు వుందంటే, మానసికంగా కావాలి అలాటి మహనీయులు తలచుకుంటే మనకి వేసవి కాలాలే వుండవు. రోహిణీ కార్తికి మరేదైనా చక్కటి, చల్లటి పేరు పెట్టుకోవలసి  వుంటుంది.

ఆయనగారి ప్రభావం వల్ల   ఇక మన దేశంలో ఎండాకాలమే వుండకపోవచ్చు. కావాలంటే జోరు వానలు తగ్గించవచ్చు. జడివానలు ఎక్కువ చేయవచ్చు. సకాలంలో మాత్రమే  వాటిని కురవనిచ్చి, అకాలంలో ఆపివేసి, వరదలు మొదలైన బాధలు లేకుండా చెయ్యవచ్చు.

అంటే ఏమన్నమాట. ఫలానా సమయంలో ఫలానా ప్రాంతంలో కొన్ని అంగుళాల ధార వాన మాత్రమే కురవాలని చెప్పి, ఆ ప్రకారం చేయించి, వాన అవసరాన్ని బట్టి మాత్రమే కురిపించి ప్రజానీకాన్ని మురిపించే పరిస్థితి కల్పించడం కూడా సాధ్యం కావచ్చు.

రామాయణంలో మనకు ఋష్యశృంగుని కథ కనిపిస్తూంది. ఆయనగారిని దేశంలోకి తీసుకు వస్తే కుంభవృష్టి కురిసింది. పాడి పంటలు చక్కగా వర్ధిల్లాయట. అలాంటి ప్రభావం ఆయనగారిలో వున్నదని రుజువు చేశారు. మరి ఆయనగారి వల్ల కుంభవర్షాలే సాధ్యంగాని, చెంబు వర్షాలు సాధ్యం కావేమో. అవసరాన్ని బట్టి వర్షం అనే సూత్రం ఆయనగారికి వర్తించదేమో మరి.

నేను పైన చెప్పిన పెద్దమనిషికి దూరదృష్టి వుందిట. ధ్యానంలో జగత్తు అంతా ఆయన ముందు ప్రత్యక్షమవుతుందట. ఇటీవల చంద్రమండలానికి పంపిన అపోలో మార్గ మధ్యంలో చెడిపోయి ఎలాగో భూమికి దిగిన సంగతి అందరికీ తెలుసు.

పైన చెప్పిన పెద్ద మనిషి ఈ విషయాన్ని కొద్దిరోజులు ముందుగానే గ్రహించి, అందరికీ తెలియచేశారట. పత్రికలలో కూడా ఆ వార్త ప్రకటించబడింది. ఆయనగారి సూచన నిజమైనందుకు ఎంతో ఆశ్చర్యపోయారు. సరిగ్గా ఆయనగారు చెప్పినట్లుగానే రెండు స్విచ్చులు పాడైనాయని తర్వాత ప్రకటించడం జరిగింది. ఇది చాలా విచిత్రమైన వార్త కాదూ.

ఏది ఏమైనప్పటికీ మానవ శక్తిని మహర్షులు అనేక విధాలుగా ప్రయోగించి పంచభూతాన్నికూడా పెంపుడు జంతువుల్లాగా చేసుకో కలిగారనేది నిజమేననిపిస్తుంది.

దీన్నే ఇంగ్లీషువాళ్ళు "విల్ పవర్" అని చెప్పుకుంటూ వుంటారు. దీనితోనే వాళ్ళు ఏవో కొన్ని చిన్న చిన్న విజయాలు సంపాదించి గొప్పగా  చెప్పుకుంటూ వుంటారు.

మన సంగతి అలాకాదు. ఆత్మశక్తితో అండ పిండ బ్రహ్మాండాన్ని కదిలించి వేయగలరు. అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుని దగ్గరకు పిలిపించుకోగలరు. అవసరమైతే, జగత్తును ఉయ్యాలలూగించగలరు.

దేశంలో అవినీతిని, అనైక్యతను అరికట్టడం కోసం కూడా ఇలాంటివారు తమ శక్తుల్ని వినియోగిస్తే మానవజాతికి ఎంతో విజయం కలుగుతుంది. అశాంతి నించి విముక్తి లభిస్తుంది.

Post your comments